
# పాటు

జి.నరసింహమూర్తి



అనంతరావు భార్య పురుడి కెళ్ళినప్పట్నుంచీ అతనికి హోటల్ భోజనమే గతయ్యింది.

ప్రతి రెండు మూడు సంవత్సరాలకీ వెంటాడే ట్రాన్స్‌ఫర్లవల్ల పిల్లల చదువులు దెబ్బతింటున్నాయి. కనుక యేకంగా యింటిదగ్గర బడిలో చేర్పించేందుకు తీసుకెళ్ళి, టెంపరరీగా మా ఆవిణ్ణి కూడా అక్కడే వదిలేశాను. దాంతో అనంతరావు గతే నాకూ పట్టింది. అతనిలాగే హోటల్ భోజనం నాకూ గతయ్యింది.

వెనకబడిన పల్లెటూరు కనుక మేం భోంచేస్తున్నది హోటలనేకంటే

పూటకూళ్ళ ఇల్లనడం భావ్యం. అదెక్కడో రెండుఫర్లాంగుల దూరంలో ముసుగుతోటలో ఓ రిటైర్డ్ ఆర్మీ అతను తన యింట్లోనే పెట్టుకుని కాలక్షేపం చేస్తున్నాడు. దానికి 'ఆర్మీ హోటల్' అని పేరెట్టడంతో భోజనం యెలా తగలడినా తినడంమాత్రం తప్పడంలేదు.

తిండెలా ఉన్నా గాని మేమిద్దరమూ అందరికన్నా డిఫరెంట్ యాంగిల్లో దేశకాల పరిస్థితుల్ని ఆలోచించే జబ్బున్న మనుషులం కనుక మా జోడీ బాగా కుదిరింది. అంతకుముందెప్పట్నుంచో స్నేహితులం. ఇంట్లో అదిలేదనీ ఇది కావాలనీ పట్టుకులాగే పెళ్ళాల్లేక పోవడంతో సంతగోలనుంచి బయట పడినంత రిలీఫ్‌గా ఉంది.

రాత్రులు మా డిస్కషన్స్ ఒంటిగంట వరకూ సాగేవి.

అనంతరావు ఒరిజినాలిటీ ఉన్నవాడు. దాంతోపాటు కావలసినంత ఇంటలిజెంషియా ఉంది. హైద్రాబాద్ బదురికా కాలేజీలో ఫస్టుక్లాసులో కామర్స్ డిగ్రీ సంపాదించాడు. జమ్మూ యూనివర్సిటీ లా కాలేజీలో లా పాసయ్యాడు. ఏ సబ్జెక్టుమీద సంభాషణ లేపినా వేళ్ళదాకా వెళ్ళిపోయి డామినేట్ చేస్తాడు

ఉన్నది క్లర్క్‌పోస్టులోనే అయినా కొమ్ములు తిరిగిన ఆఫీసర్లు అతనిమీదే ఆధారపడుటారు అన్నిపనుల్లోనూ-

తను లేంది యేమీ జరగదు. జరగ లేదు.

నిర్భయంగా ముందుకెళ్ళమంటాడు. తానూ ట్రెమండస్ జీల్‌తో డేరింగ్‌గా ముందుకెళ్ళిపోతాడు. దేనికీ తలవంచడు. దేనికీ భయపడడు.

కాని తన పర్సనాలిటీ మోల్డింగ్‌లో రేయింబవళ్ళంత కృషిచేసి వ్యక్తిగా మంచి సామర్థ్యమూ, చతురతా సంపాదించిన అనంతరావుకి పర్సనల్ లైఫ్‌లో దోర్‌మెంటుగా ఓ గొప్ప భయం అతణ్ణి ముక్కలు ముక్కలుగా చీల్చేస్తుంటాది.

అదే పాము!

అనంతరావుని అగాధంలో దూకమన్నా భయపడడుగాని పాము మాట చెవిని బడినా, పాము కంటబడినా గగ్గోలయిపోతాడు. అల్లకల్లోలంచేస్తాడు. దడదడ్లాడిపోతాడు. ఆ సమయంలో అంతటి పాజిటివ్ అనంతరావూ నెగిటివ్‌గా మారిపోతాడు.

ఊళ్ళో యెక్కడ చూసినా డొంకలూ, పొదలూ, పుట్టలూను. దానికి తగినట్టే ఊరు నల్లనాగులకి ప్రసిద్ధి ఎవరికో ఒకరికి పాము కనిపించని రోజుమాత్రం ఉండదు కాని కరచినట్టుమాత్రం యెక్కడా విన్నది లేదు.

పాములోళ్ళు అప్పుడప్పుడూ వాటిని పట్టుకుపోవడం అనంతరావుకీ తెలుసు, నాకూ తెలుసు.

ఒకరోజు పాములోడు చేతిలో ఉన్న

పాముని చూసి అనంతరావుకి ముచ్చెమటలు పోశాయి.

అప్పట్లో ఒకరోజున ఓ సంగతి జరిగింది.

అనంతరావు యెలా ఉన్నవాడు అలా మా యింటివరకూ పరుగెత్తుకొచ్చాడు 'పాము పాము' అంటూ.

అదేదో నల్లనాగు కాబోలని కంగారుగా వాళ్ళింటికి పరుగెత్తాను, గుమ్మంలో వాళ్ళావిడ నిలబడి విరగబడి నవ్వుతోంది.

నాకంతా వింతగా ఉంది.

"ఏమండీ - పామెక్కడ?" అడిగాను కంగారుగా ఆవిణ్ణి.

ఆవిడలాగే నవ్వుతోంది.

అనంతరావుకి తన భయాణ్ణి చూసి భార్యకు పిచ్చెక్కిందో, లేక తనకున్న ధైర్యసాహసాల్ని చూడమని అలా నవ్వుతూందో అర్థంకాక చిర్రున లేచాడు.

"పామూలేదు పాడూలేదు. ఆయనతో అలా జోక్ చేశాను. అంతే- అది వినడంతోనే గబుక్కున గుమ్మం ఉరికి మీ యింటివరకూ పరుగెత్తుకొచ్చేశారు" అంటూ మళ్ళీ పగలబడి నవ్వింది.

అనంతరావు భార్యమీద చేయి చేసుకునేవాళ్ళను తీవ్రంగా విమర్శించే మనిషి. కాని ఆవేశ తానే ఓ పాములా బుస్సున లేచాడు ఆ కోపం భరించలేక. నేనుండటంతో సరిపోయింది గాని లేకపోతే ఆ నవ్వులాటకి కఠినమైన శిక్ష ఆమె అనుభవించేదేమో!

ప్రతి మనిషికీ యేదో ఒకటంటే భయం. దాని సైకాలాజికల్ ఒరిజిన్ యిదని చెప్పలేం గాని యేదో ఒక మూలకారణం సైకాలజిస్టులు చూపెట్టకుండా మానరు. అందుచేత అనంతరావుకున్న పాముభయానికి కారణం తెలియదు గానిఅదెలా తీసెయ్యాలని అప్పుడప్పుడూ ప్రయత్నం చేసేవాణ్ణి.

'సైన్స్ టుడే' మాగ్‌జైన్‌లో ఓసారి పాములగురించి మంచి ఆర్టికలొస్తే అది చదవమని ఇచ్చాను.

మర్నాడు పొద్దున్న "ఎలాగుందండి ఆర్టికల్?" అడిగాను.

"మీ ఆర్టికల్ నా కొంప ముంచిందండీ రాత్రంతా—"

మేమెప్పుడూ అలాగే పిలుచుకుంటాం. అతణ్ణి కూడా పిలవ్వాల్సివస్తే నేను కూడా 'అనంతరావుగారూ' అనో 'రావుగారూ' అనో పిలుస్తూంటాను.


"అదేంటండీ?"

"యేం చెప్పమంటారు— రాత్రంతా నా మంచంమీద పాములు.

యింట్లో పాములు. తిండిలో పాములు కడుపులో పాములు."

"పాములా?"

"అవునండి. కోబ్రాలు, కొండచిలవలు, పసరపాములు, జెర్రిపోతులు, పొడపాములు, కట్లపాములు—




"అబ్బబ్బ అటువంటి ఆర్టికల్ యెందుకు చదివానా అనిపించింది" అంటూ ముఖం చీదరింపుగా పెట్టాడు.

కాని అదే చైనా సిద్ధాంతాలమీదో, రష్యన్ లేబర్ రివల్యూషన్‌మీదో, ఇండియన్ పొలిటికల్ డిబేకల్స్ మీదో, బాబాలమీదో, మెంటల్ రివిలేషన్ మీదో, యేదైనా పుస్తకం యిచ్చి మర్నాడు మాట్లాడవలసి ఉంటే కత్తిలా దూసుకొచ్చి గంటలతరబడి యేకిపారేశే— వాడే మరి! కాని యేం చెయ్యడం! అది అతని వీక్‌నెస్!

సాయంత్రం అనంతరావుకోసం వెయిట్ చేస్తున్నాను భోజనానికి వెళ్ళడానికి.

"కుమార్‌గారూ! కుమార్‌గారూ!" అంటూ కంగారుగా వచ్చాడు.

అతనొచ్చేసరికి సరిగ్గా లైటు పోవడంతో, అంతకుముందే వెలిగించి ఉంచిన హరికెన్ వత్తు పెద్దదిచేసి బయట కొచ్చాను.

"రాత్రి సంగతి విన్నారంటే బిత్తర పోతారు" ఒకటే కంగారు అతనిలో. కొంచెం వొణుకు కూడా పసిగట్టాను.

"యేంటండీ?"

"మనం రాత్రి బతికిపోయాం సార్."

నాకేమీ అర్థంకావడంలేదు.

హరికెన్ చటుక్కున తీసుకొని అరుగుపక్కల్నా, కిందా ఆ చుట్టూ పరీక్షగా చూసి తృప్తిగా నిట్టూర్చాడు. సిమ్మెంటు అరుగుమీద కాళ్ళు పైకెట్టు కూర్చున్నాడు.

ఇదంతా ఏదో మతిలేని పనిలాఉంది. అయినా—

"యేంటండీ?!" అడిగాను.

"పామండీ"

"యెక్కడ?" అటుఇటు చూస్తున్నాను.

గబుక్కున నన్ను తప్పించుకొని తెరుచుకున్న గుమ్మం తలుపులు మూసి వస్తూ "మీ యింట్లోకేమైనా పాము దూరగలదు" అంటూ జాగ్రత్తలు చెపుతున్నాడు.

"అసలింతకీ పామెక్కడండీ?"

"ఓ— అసలు సంగతి యెందుకో ఈ గడిబిల్లో మర్చేపోయా— అదేంటంటే?— రాత్రి మనం పంట కాలవ సిమ్మెంటు వంతెన దిగి రోడ్డెక్కామా?"

"అవును"

"అపుడు లైట్లు లేవు"

"అవును. పవర్ కట్ గొడవ ప్రతి చోటా ఉంది మరి. అందుచేత తడుముకుంటూ నడిచాము."

"మిమ్మల్ని రోడ్డుకి మధ్యగా రమ్మన్నానా?"

"———" అసలు సంగతి యెప్పటి కొస్తుందోనని వింటున్నాను. "సరిగ్గా రోడ్డు టర్నింగ్‌లో, యిటు చలమయ్య కిరణా దుకాణం వేపున్న చిన్ని మట్టి రోడ్డు క్రాసింగ్‌లో యింత నాగుపామును చంపారండి"

"ఓహో— ఇంతకీ యిదా సంగతి?" నిట్టూర్చాను యాంటీ క్లైమాక్స్‌కి వచ్చి.

"అవునండి మనం వస్తుంటే మనకో కుర్రోళ్ళ బాచ్ యెదురొచ్చిందా?"

"అవునండి. వాళ్ళ దగ్గర టార్చి లైటు కూడా ఉంది" అదే వాళ్ళ గొప్ప తనం. ఆ సమయంలో— మాకు లేని టార్చి వాళ్ళకుంది గనుక.

"అంతే కాదండి. వాళ్ళు తాగొస్తున్నారంట."

అసలు పాముకీ తాగుడికీ కారణం యేమయ్యి ఉంటాదా అని విస్తుపోయాను.

"సరిగ్గా పాము రోడ్డు సెంటర్లో కొచ్చేసరికి అందులో ఒకడు యింత రాడు తీసుకొని సరిగ్గా దాని తలమీద వేశాడంట—"

ఒహో! అయితే తాగిన మత్తులో ఉన్నాడు కనుక తానెన్నడూ చెయ్యలేని గొప్ప పని అపతల వ్యక్తి చేయగలిగాడని చెప్పడానికే ఈ ప్రయత్నం అంతా.

"అంత ధైర్యం వాళ్ళకెలా వచ్చిందనుకుంటున్నారు?— లిక్కరు నెక్ దాకా కొట్టేసి ఉన్నారండీ"

అనంతరావు చెప్పిందంతా నిజమే. ఆ మర్నాడు ఉదయం తాను ఆఫీసుకెళ్తూ అంతా చూస్తుంటే తానూ ఆ చచ్చిన పాముని చూశాడంట.

మొత్తంమీద గత రాత్రి పాము ప్రమాదం తప్పిందని అనంతరావుకి ఆనందమైంది

"ఈ ఊళ్ళో వొచ్చిపడ్డానెందుకో— నాకెప్పుడు ట్రాన్స్‌ఫర్ వస్తుందిరా దేవుడా!" అన్నాడు అనంతరావు డిస్పరేట్ స్టేట్‌లో.

"మీరింత భయపడితే యెలాగండి?— ఈ ఊళ్ళో ఎన్ని వందలమంది నివసించడంలేదూ? — సరే ఆలస్య మయ్యింది భోజనానికి పదండి." అన్నాను

"ఇంత చీకట్నా?"

"రోజూ వెళ్ళడంలే?"

"అది వేరే సంగతి— ఈ వేళ నాకు మరీ భయంగా ఉందండి"

"ఫర్వాలేదు. పదండి"

"టార్చి కూడా లేదాయె"

"ఇపుడెక్కడొస్తుందండి పదండి" అంటూ తొందరజేస్తూ తలుపు తాళం వేయబోయాను.

"పోనీ ఈ హరికెన్ లైటు పట్టుకెళ్తే?"

నాకు నవ్వొచ్చింది. అతని చూపులు హరికెన్ లైటు మీదే ఉన్నాయి అతని పరిస్థితి చూస్తూంటే జాలిగా కూడా ఉంది. ఎంతవాడు యెంతగా దిగజారిపోతున్నాడు ఈ భయంవల్ల!

మరీ కంట్రీఫెలోస్‌లా చేతిలో హరికెన్‌లైట్ పట్టుకుని నడుస్తూంటే, చూసేవాళ్లేమనుకుంటారు. ఉన్న ఉద్యోగాల్ని చూసుకొనయినా కాస్త ప్రిస్టేజ్ మెయింటెయిన్ చేయకపోతే ఎలా?

మొత్తంమీద అనంతరావుకి నచ్చజెప్పి రోజూ వెళ్ళే తోవన వెళ్దారంటే కుదర్దంటాడు.

మామూలుగా వెళ్లే షార్ట్‌కట్ లంట వెళ్ళడానికి అంగీకరించకుండా రోడ్డంతా చుట్టుకుని అటే వెళ్ళాలంటాడు. ఇతని భయం మరీ దారుణంగా ఉంది. అతని మీద కోపమొచ్చినా అది బయటకు కనబడనీయకుండా దాచుకున్నాను. అతను చెప్పినట్టే అదంతా చుట్టుకొని వెళ్ళాల్సొచ్చిందావేళ.

మర్నాడు భోజనం వేళకి చాలా స్మార్ట్‌గా వచ్చేశాడు అనంతరావు.

"కుమార్‌గారూ!" అని పిలిచాడు. ఆ పిలుపులో ఏదో విజయగర్వంలాంటిది కనిపించింది

"యేంటబ్బా సంగతను"కొని యింట్లోంచి బయటకొచ్చాను.

అతని ముఖంలో వంద సర్కస్ లైట్ల కాంతి గోచరించింది.

చేతిలో ఏదో ఆయుధంలా టార్చి తళుక్కుమంది.

"యేంటాసార్ యింత పెద్ద టార్చి కొన్నారు?" అడిగాను నవ్వుతూ.

"ఇంతకంటే పెద్ద సైజు దొరకలేదండీ. ఎవర్రడీ లీక్ ప్రూఫ్ సిల్వర్ సెల్స్ వేయించాను. చూడండి ఫోకస్— ఫర్లాంగు దూరంలో పామున్నా మనక్కబడిపోతుంది" అంటూ త్రీ సెల్స్ టార్చి లైట్ ఆన్‌చేసి దూరంగా ఉన్న చెట్ల మీదా, గుట్టలమీదా అదేలోకం ఫోకస్ చేసి చూపించాడు అనంతరావు.

అప్పట్నుంచీకాస్త పొద్దుగూకిందంటే చేతిలో ఓ ఆయుధంలా టార్చితో

కనిపించేవాడు అనంతరావు. అనంత రావుని అప్పట్నుంచీ యెంత దూరా న్నుంచయినా యీజీగా పోల్చుకోవచ్చు యెవరైనా!

పగలంతా వచ్చి పొలిటికల్ సబ్జక్ట్సు, నేషనల్ అండ్ ఇంటర్నేషనల్ టాపిక్స్ తీవ్రంగా చర్చించే అనంతరావు రాత్రయ్యేసరికి వట్టి పాముల గొడవలు మాత్రమే మాట్లాడుతున్నాడు.

భోజనాని కెళ్ళేటప్పుడూ అదే గొడవ. వచ్చేటప్పుడు అదే గొడవ. నాకో పక్క మరీ యిబ్బందిగా ఉన్నా మావన్నీ చాలా గౌరవప్రదమైన డీలింగ్స్ కనుక ఊకొడుతూ రావల్సి వస్తోంది.

ఇలా చాలా రోజులు గడిచాయి.

పాముల కథల్తో నా తల కొట్టుకు పోతోంది. నేనేదైనా కొత్త సబ్జక్టు మార్చినా తాను తిరిగి పాము కథకి లింక్ పెట్టేవాడు. ఈ భయం కడకి అనంత రావు కెలా పరిణమిస్తాదోనని నాకూ భయమేసేది అప్పుడప్పుడూ.

ఆవేళ భోంచేసి తిరిగొస్తున్నాం.

అనంతరావు టార్చి మాత్రం హేర్బర్‌లో లైట్లా వెలుగుతూనే ఉంది.

"చూడండి కుమార్ గారూ! నాకు త్వరలో ట్రాన్స్‌ఫర్ వచ్చేస్తుంది. ఈ విషయం మా ఛీఫ్‌కి స్వయంగా రాసి తెలుసుకున్నాను. దాంతో నాకీ పాముల బెడద తీరిపోతుంది. ముఖ్యంగా నాకిక్కడ ఏ ఇబ్బందీ లేకపోయినా పాముల గొడవవల్ల తప్పనిసరిగా ట్రాన్స్‌ఫర్ చేయించుకుంటున్నాను.

వన్యమృగ సంరక్షణతోపాటు విష జంతువుల నిర్మూలన కూడా ఒక ముఖ్య పథకంగా సాగాలండి" అంటూ యేకధాటిగా చెప్పుకుపోతున్నాడు.

సిమ్మెంటు మెట్లెక్కి కాలవ వంతెన మీద కొచ్చాం. అనంతరావు పాముల పోలిటిక్స్ లాంటివి చెబుతూ ముందు నడుస్తున్నాడు. నేనేదో నా స్వంత గొడవలు ఆలోచించుకుంటూ వేరే ధ్యానం మీద అతని వెనకాలే నడుస్తున్నాను.

అతని టార్చి వెలుగు వందగజాల వరకూ తన్నుతోంది.

మెట్లు దిగుతున్నాం, అతనుముందు- నేను వెనకా—

ఆఖరి మెట్టు.

భయంగా, వెర్రికేకేశాడు అనంతరావు

బుస్సుమన్న శబ్దం స్పష్టంగా విన్నాను.

అనంతరావు చేతిలో టార్చి కింద పడిపోయింది.

గబుక్కున టార్చి తీసుకున్నాను.

"పాము పాము. కరిచేసింది" అనగలిగాడు బాధగా.

అటు టార్చి ఫోకస్ చేశాను.

కాలనాగు చర్రున వెళ్ళిపోతోంది ముందున్న దొంకల్లోకి.